
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



తిరుపతి

జిల్లా వార్తలు

శనివారం 6 సెప్టెంబరు 2025



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకుంటున్న ప్రొఫెసర్లు ఎం.అరుణ (హోంసైన్స్) | పెంచలనేని జ్యోత్స్న (బయో టెక్నాలజీ) | వెంకటకృష్ణ (కంప్యూటర్‌సైన్స్) | వైఎస్ శారద (ఇంగ్లీషు) | డి.సుబ్బారావు (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) | అక్కల స్వతంత్ర (మెకానికల్ ఇంజనీరింగ్) | టి.రమాశ్రీ (ఈసీఈ) | ఎం.బాలాజీ (బయోకెమిస్ట్రీ) | టి.విజయ (బోటనీ)



టి.చంద్రశేఖరయ్య (పాపులేషన్ స్టడీస్) | రమ్యాకుబేర్ (ఫార్మసీ) | సి. భువనేశ్వరిదేవి (పద్మావతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్) | ఈశ్వరరావు (లైవ్‌స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ) | లెక్చరర్లు పి.కుమారి నీరజ (శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల) | గంగారామ్ (శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల) | చీర్ల వెంకటరమణ (చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల) | టీచర్లు సుబ్రహ్మణ్యశర్మ (శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు) | కె.బాలసుబ్రహ్మణ్యం (తొట్టంబేడు మండలం సాంబయ్యపాలెం) | శెట్టి రామకృష్ణ (శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి పాఠశాల పీడీ) | ఎస్వీ కుమార్ (పుత్తూరు మండలం పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్)

గురుపూజోత్సవంలో కలెక్టర్ పిలుపు

68 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు

విద్యార్థులపట్ల వ్యక్తిగతంగా శ్రద్ధ చూపాలి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతల వివరాలు.. 8లో





పురస్కార గ్రహీతలతో కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు



డీఈవోను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, కలెక్టర్



తిరుపతి(విద్య), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'వృత్తిపరంగానే ఆలోచించకుండా విద్యార్థులపట్ల వ్యక్తిగతంగానూ ఉపాధ్యాయులు శ్రద్ధ చూపండి. అప్పుడే విద్యార్థులు వారి ఇబ్బందులన్నీ మీకు చెబుతారు. వాటి పరిష్కారానికి మీరు తోడ్పడినప్పుడు విద్యార్థులకు చదువుపట్ల ఆసక్తి పెరుగుతుంది. వారి ప్రవర్తన, ఫలితాల్లోనూ పురోగతి కనబడుతుంది' అని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో జరిగిన గురుపూజోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు వినూత్నంగా కొత్త బోధనా పద్ధతులు అవలంబించాలన్నారు. ప్రతి తరగతికి ఒక టీచరు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలలను వర్గీకరించిందని వివరించారు. ఈ వర్గీకరణ ఫలితాలు ఇప్పుడు కనబడవని, ఐదేళ్లలో ఆవిష్కృతమవుతాయని తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. అందుకనే ఏడాదిలోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుందన్నారు. సమాజాన్ని జాగృతి చేయడంలో ఉపాధ్యాయులదే కీలక భూమిక అని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. ప్రభుత్వ విద్యలో లోటుపాట్లు లేకుండా ఉపాధ్యాయ నియామకాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. విద్యారంగంలో అనేక సంస్కరణలను మంత్రి నారా లోకేశ్ తీసుకొచ్చారని శాప్ చైర్మన్ రవినాయుడు వివరించారు. గురువులు చూపిన బాటలో నడిచేవారందరూ ఆయా రంగాల్లో అభివృద్ధి చెందుతారని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ తెలిపారు. సమాజంలో మనలను మంచి పౌరులుగా తీర్చిదిద్దేవారు గురువులేనంటూ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, విద్యాశాఖలో విప్లవాత్మక మార్పుల గురించి జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా జిల్లాలోని 62 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు ఎంఈవోలకు కలిపి మొత్తం 68 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు, సమగ్ర శిక్ష సీఎంవో సురేష్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు. గురుపూజోత్సవాన్ని డీఈవో కుమార్, ఇతర అధికారులు శ్రమకోర్చి విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా డీఈవోను సన్మానించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కార్యక్రమం చేపట్టారు.



సీఎం ప్రత్యేక చొరవతో 'శెట్టిపల్లె'

భూసమస్యకు పరిష్కారం

- త్వరలో ఏర్పాటుకానున్న మోడల్ టౌన్‌షిప్
- వచ్చే నెలలో లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు
- మీడియా సమావేశంలో కలెక్టర్ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, కమిషనరు మౌర్య

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతో శెట్టిపల్లె భూసమస్య పరిష్కారమైందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంత్రివర్గ సమావేశంలో శెట్టిపల్లె భూసమస్యకు క్లియరెన్స్ ఇవ్వడంతో శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. హౌస్ హోల్డర్లకు 50:50 నిష్పత్తిలో, వ్యవసాయభూమి కలిగిన వారికి 30:70 నిష్పత్తిలో ప్లాట్లు కేటాయిస్తామన్నారు. తుడాకు 65, ప్రభుత్వానికి 90 ఎకరాలు వచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. తుడా రూ.200కోట్లతో ఇక్కడ మెగా టౌన్ షిప్‌తరహాలో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వానికి కేటాయించిన 90 ఎకరాలలో వరల్డ్ క్లాస్ ప్రాజెక్టులు, టూరిజం ప్రాజెక్టులు తీసుకువచ్చి భూముల విలువ పెరిగేలా చర్యలు చేపడతామన్నారు. 'మొదట ప్రతి ఒక్కరికి సెంటున్నర ఇవ్వాలనుకున్నాం. అయితే ప్రజాప్రతినిధుల కోరిక మేరకు సీఎం చంద్రబాబు రెండు సెంట్లు ఇవ్వాలని ఆదేశించారు. 1,300మందికి పైగా రెండు సెంట్ల స్థలం, మిగిలిన వారికి రెండు సెంట్లకంటే ఎక్కువ భూమి ఇచ్చే అవకాశం ఉంది. దాదాపు 2,500 కుటుంబాలు దీని ద్వారా లబ్ధి పొందుతాయి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.2 వేల కోట్ల ప్రాపర్టీకి రిజిస్ట్రేషన్ చర్యలు చేపట్టనున్నాం. తుడాకు కేటాయించిన 65 ఎకరాల్లో నెల రోజుల్లోపలే అంతర్గత రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక వసతుల పనులు ప్రారంభిస్తారు. అక్టోబరు 15 నాటికి లాటరీ పూర్తి చేసుకుని తరువాత ప్లాట్లు కేటాయిస్తారు. మరో 45రోజుల్లో జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో శెట్టిపల్లివాసులకుపట్టాలు పంపిణీ చేస్తాం' అని కలెక్టర్ వివరించారు. ఈ ప్రాంతాన్ని ఒక మోడల్ టౌన్‌షిప్‌గా ఏర్పాటు చేయడమే సీఎం ఆలోచన అన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ శెట్టిపల్లి వాసులకు ఇచ్చిన హామీని చంద్రబాబు, పవన్ నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వంలో తుడా నుంచి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి శెట్టిపల్లిని మార్చి భూములుకొట్టేయాలని ఆ పార్టీ నాయకులు ప్రయత్నించారని ధ్వజమెత్తారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆ ప్రాంతంలోని 227 ఎకరాల్లో మౌలిక వసతులు కల్పించి మెగాటౌన్‌షిప్‌ను నిర్మిస్తామన్నారు. తుడాకు కేటాయించే 65 ఎకరాల ద్వారా సమకూరే ఆదాయంలో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన 227ఎకరాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు.నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య మాట్లాడుతూ శెట్టిపల్లి వాసులకు అన్ని వసతులతోకూడిన లేఅవుట్లు ఏర్పాటు చేస్తామన్నారు. శెట్టిపల్లి భూబాధితులు రాష్ట్ర ప్రభుత్వానికి,ప్రజాప్రతినిధులు, కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చదువు చెప్పిన చోటే వద్దంటోంది

వారు అక్కడే చదువుకున్నారు. అక్కడే పట్టభద్రులయ్యారు. కొందరు అక్కడే అడహక్ కింద ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే రెగ్యులర్ ఉద్యోగుల నోటిఫికేషన్‌కు మాత్రం వారు అర్హులు కాదని పక్కన పెట్టేశారు. వారు అర్హులేనని చట్టం చెబుతున్నా అవేమీపట్టకుండా మొండిగా ముందుకెళ్తున్న శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యాజమాన్యంపై పలువురు వైద్య అభ్యర్థులు మండిపడుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- పట్టా ఇచ్చిన సంస్థే పక్కన పెట్టేసింది
- నిబంధనలకు విరుద్ధంగా స్విమ్స్ నోటిఫికేషన్
- మెడికల్ అభ్యర్థులకు టీటీడీ అన్యాయం



మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీ కొరతను దృష్టిలో పెట్టుకుని స్విమ్స్ వర్సిటీలో 2003 నుంచి మెడికల్ ఎమ్మెస్సీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. బీఎస్సీ (లైఫ్‌సైన్సెస్) చదివిన విద్యార్థులకు స్విమ్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహించి, అందులో వచ్చిన ర్యాంకుల ఆధారంగా అనాటమీ, ఫిజియాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ కోర్సులలో సీట్లు కేటాయించింది. ఈ పీజీ కోర్సులకు మూడేళ్ల కాలవ్యవధిని నిర్ణయించింది. 2003లో తొలిబ్యాచ్ మొదలవ్వగా 2019 ఎంఎస్సీ మెడికల్ పీజీ కోర్సులను నిలిపివేసింది. ఈక్రమంలో 150 మంది ఎమ్మెస్సీ మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉత్తీర్ణులై స్విమ్స్‌తో పాటు వివిధ మెడికల్ కాలేజీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఆయా విభాగాల్లోని పలువురు స్విమ్స్‌లోనే పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టాపొందారు. మరికొందరు పీహెచ్‌డీ చేస్తున్నారు. పీహెచ్‌డీ చేసినవారు ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ స్థాయిలో కూడా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

ఇప్పుడెందుకు వద్దంటున్నారు

టీటీడీ నిర్వహణలోని స్విమ్స్‌లో 9 ప్రొఫెసర్లు, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 67 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి గతనెల 14న నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నోటిఫికేషన్‌లో బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్‌కు ఎండీ, ఎస్ లేదా డీఎస్సీ అర్హతలు కావాలని నిర్దేశించింది. దీంతో స్విమ్స్‌లోనే చదివిన ఎంఎస్సీ/పీహెచ్‌డీ అభ్యర్థుల పట్ల అన్యాయంగా వ్యవహరించింది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం 1956 ప్రకారం ఎమ్మెస్సీ/పీహెచ్‌డీను మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తీసుకోవచ్చు. అలాకాకుండా ఎండీ, ఎంఎస్/డీఎస్సీ ఉండాలని నిబంధన పెట్టడం సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. అదేమని అడిగితే ఐఎన్ఐ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) మేరకు రిక్రూట్ చేసుకుంటామని అభ్యర్థులకు స్విమ్స్ చెబుతున్నట్టు తెలుస్తోంది. తమకు జరుగుతున్న అన్యాయంపై కోర్టును ఆశ్రయించాలనుకున్న అభ్యర్థులకు వీలు లేకుండా ముందుగానే స్విమ్స్ కేవిట్ ఫైల్ చేసింది. ఐఎన్ఐ నిబంధనలు కేవలం జాతీయ వైద్యసంస్థలైన ఎయిమ్స్, జిప్‌మర్, పీజీఐఎంఆర్ సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. స్విమ్స్ ఇప్పటికీ స్టేట్ యాక్ట్ (రాష్ట్ర చట్టం)తో నడిచే విశ్వవిద్యాలయం మాత్రమే. నాన్‌క్లినికల్ మెడికల్ కోర్సులు (ఎమ్మెస్సీ/పీహెచ్‌డీ) చేసిన అభ్యర్థులు అర్హులేనని స్టేట్ యాక్ట్‌తో నడిచే వర్సిటీ నిబంధనలు చెబుతున్నాయి. ఆ మేరకే ఎస్వీమెడికల్ కాలేజ్, శ్రీబాలాజీ మెడికల్ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. అయితే స్విమ్స్‌లో చదివిన విద్యార్థులను మాకొద్దని పక్కన పెట్టడం ఆశ్చర్యంగా ఉంది. తల్లిలాంటి స్విమ్స్ వర్సిటీనే తమను గుర్తించకపోతే ఇతర వైద్య సంస్థలు ఏవిధంగా ఆదరిస్తాయని వైద్య అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్విమ్స్ యాజమాన్యం పునరాలోచించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

ఆరు బార్లకు మళ్లీ నోటిఫికేషన్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు దరఖాస్తులు రాని ఆరు బార్లకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేస్తూ జిల్లా ఎక్సైజ్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో ఒకటి, గూడూరు మున్సిపాలిటిలో రెండు, సూళ్లూరుపేట మున్సిపాలిటిలో రెండు, వెంకటగిరి మున్సిపాలిటీలో ఒక బారుకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానం ద్వారా ఈ నెల 14న సాయంత్రం 6 గంటల లోపు దరఖాస్తులు సమర్పించవచ్చు. ఒక వ్యక్తి ఎన్ని బార్లకైనా.. ఎన్ని దరఖాస్తులైనా అందజేయొచ్చు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

- కాణిపాకంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుని ఆలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ధ్వజావరోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయంలోని ధ్వజస్తంభంపై వున్న మూషిక ధ్వజ పటాన్ని అర్చకులు, వేదపండితులు మేళ,తాళాలు,వేద మంత్రోచ్చారణ నడుమ కిందకు దించడంతో ధ్వజావరోహణం పూర్తయింది. అంతకుముందు పుష్కరిణి వద్ద త్రిశూల స్నానాన్ని నిర్వహించారు. కాగా బ్రహ్మోత్సవాల విధుల్లో అలసిసొలసిన ఆలయ అధికారులు, సిబ్బందికి ఆటవిడుపుగా వసంతోత్సవాన్ని నిర్వహించారు.బ్రహ్మోత్సవాల ప్రారంభ సందర్భంగా ఈవో కిషోర్‌కు,ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్‌కు కట్టిన కంకణాలను శుక్రవారం అర్చకులు తొలగించారు.అనంతరం ఈవోను ఆలయ మర్యాదలతో కార్యాలయం వద్ద దిగబెట్టారు. ఇక, శనివారం నుంచి 16వ తేది వరకు ప్రత్యేక ఉత్సవాలను నిర్వహించనున్నారు.



భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ


భాకరాపేట మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భాకరాపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇస్లాం మత ప్రబోధకుడు మహమ్మద్ ప్రవక్త జన్మదిన సూచికగా మిలాద్-ఉన్-నబీ వేడుకలను శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నగొట్టిగల్లు, దీన్‌దార్లపల్లె మసీదుల్లో సామూహిక నమాజు సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను తెలియజేయడమేగాక ఆయన ఆదేశించిన పనులను తప్పకుండా పాటించాలని మతగురువులు ధార్మిక ఉపన్యాసం చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముతవల్లీ షాజహాన్ పాల్గొన్నారు.

నేడు మనమిత్ర అవగాహనా కార్యక్రమం

తిరుపతిరూరల్, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం మనమిత్ర అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీవో కె.రామచంద్ర పేర్కొన్నారు. గ్రామ సచివాలయం క్లస్టర్స్‌కు మ్యాప్ అయిన సిబ్బంది తమ పరిధిలోని హౌస్‌హోల్డర్ ఇంటివద్దకు వెళ్లి ఏదైనా ఒక సర్వీస్‌ను మనమిత్ర(యాప్) ద్వారా తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేసిన సర్వీసెస్ వివరాలు డ్యాష్‌బోర్డులో నమోదవుతాయన్నారు. ప్రతి శుక్రవా రమూ ఈ కార్యక్రమం నిర్వహించాలని, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

చలో విజయవాడకు తరలిరండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

చంద్రగిరి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు బకాయిల సాధనకు, హాస్టల్ సమస్యల పరిష్కారానికి శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో విజయవాడకు తరలిరావాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. శుక్రవారం చంద్రగిరిలో మండల కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తేజ మాట్లాడుతూ ఫీజు బకాయిలు ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీలు సరిపోవడం లేదని, తక్షణమే రూ.3 వేలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు వరుణ్ కుమార్, మోహన్, రాకేష్ రెడ్డి, అరుణ్ కుమార్, దామోదర్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


చిన్నయ్యనాయుడు (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లెకు చెందిన వడ్లమూడి చిన్నయ్యనాయుడు(102) మృతి చెందారు. వృద్ధాప్య సమస్యలతో ఆయన కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన టీడీపీ ఎన్‌ఆర్‌ఐ సోషల్ మీడియా కోఆర్డినేటర్ వడ్లమూడి సారథినాయుడు తండ్రి.

ఆర్సీపురం ఎస్‌ఐగా భక్తవత్సలం బాధ్యతల స్వీకరణ



రామచంద్రాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎస్‌ఐగా శుక్రవారం భక్తవత్సలం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి సంబేపల్లి పోలీస్‌స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన మహాగణపతి హోమం


మోదకాలతో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రామచంద్రాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశక్తిపీఠంలో శుక్రవారం నిర్వహించిన మహాగణపతి హోమం పూర్ణాహుతితో ముగిసింది. 9 రోజులుగా శక్తిగణపతికి వివిధ అలంకారాలతోపాటు లక్ష మోదకాలతో హోమం నిర్వహించారు. శుక్రవారం మరకతశక్తి కాళీ అమ్మవారితోపాటు శక్తి గణపతికి సుగంధ పరిమళద్రవ్యాలతో అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ చేపట్టి, ఉదయం 9 గంటలకు వేదపండితులు 11వేల మోదకాలతో మహా గణపతి హోమం ప్రారంభించగా శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మధ్యాహ్నం 12గంటలకు పూర్ణాహుతితో ముగించారు. అన్నదానం చేశారు. సాయంత్రం కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతి స్వామి మహాశక్తి గణపతి వైభవాన్ని వివరించారు. కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నేతలు


మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

చంద్రగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మండల టీడీపీ నేతలు కలిశారు. తొండవాడ సమీపంలోని పీఎల్‌ఆర్ కల్యాణ మండపంలో ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన మంత్రిని తొండవాడ గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, పులికంటి మోహన్‌రెడ్డి, జగ్గారెడ్డి కలిసి శాలువలతో ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు


తురకపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పాకాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబి పురస్కరించుకుని మండలంలోని ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. పేరసానిపల్లె పంచాయతీ తురకపల్లె నుంచి దామలచెరువు - రవణయ్యగారిపల్లె వరకు ర్యాలీ నిర్వహించారు. దామలచెరువు, మొగరాల, ఊట్లవారిపల్లె, పాలినేనివారిపల్లె, పకీరుపేట, కరీంతుల్లాబాద్, రైల్వే మసీదు, పాకాల మెయిన్ రోడ్డులోని పెద్ద మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిలాద్ ఉన్ నబి పండుగను ఘనంగా జరుపుకున్నారు.


బంగారు తిరుచ్చిపై ఉభయదేవేరులతో ఊరేగుతున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం స్వామివారు బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో ఊంజల్ సేవ చేశారు. అనంతరం ఉత్సవర్లను అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

భూమాత రక్షణపై అవగాహన పెంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో మమత

రామచంద్రాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు భూసార ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకాన్ని చేపట్టాలని, భూమాత రక్షణపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖాధికారిణి మమత అన్నారు. శుక్రవారం మిట్టూరు కమ్యూనిటీ హాల్‌లో భూమాత రక్షణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తప్పక భూసార పరీక్షలు చేయించాలన్నారు. దాన్ని అనుసరించి ఎరువులు వాడితే మంచి దిగుబడి వస్తుందన్నారు. వరిని ఆశించే కాండం తొలుచు పురుగు, ఆకుముడత, అగ్గి, ఎండ తెగుళ్ల నివారణ గురించి వివరించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, ఈ పంట నమోదుపై వివరించారు. ఎస్‌ఐ మురళీమోహన్, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నాని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారమూ పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సంకీర్తనలు ఔషధంతో సమానం

● మెటర్నరీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీలాదేవి


మెటర్నరీ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న సుబ్రమణ్యం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రోగాలకు సంకీర్తనలు ఔషధంలా పనిచేస్తాయని తిరుపతి మెటర్నరీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీలాదేవి అన్నారు. ఆసుపత్రి అవరణలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంకీర్తన కచ్చేరిని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఆస్పత్రిలోని రోగులు, వారి సహాయకుల్లో భక్తిభావాన్ని పెంపొందించేందుకు ప్రతి శుక్రవారం, శనివారం, ఆదివారం సంకీర్తన కచేరి, హరికథ గానం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసిన టీటీడీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు ఆధ్వర్యంలో గాత్ర కళాకారులు డాక్టర్ కె.సుబ్రమణ్యం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అలరించాయి. వయోలిన్‌తో రెడ్డిరాజా, తబలాతో బాబురావు, శృతి రిథమ్స్‌తో ప్రమీల సహకరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ పి.మురళి, కళాకారుడు ఈశ్వరయ్య, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు అమ్మవారి ఆలయం మూత

తిరుచానూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం పురస్కరించుకుని ఆదివారం తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ తలుపులు మూసివేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.15గంటలకు మూసివేస్తారు. 8వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు ఆలయాన్ని తెరచి శుద్ధి, పుణ్యావచనం చేస్తారు. ఉదయం 8గంటలకు సర్వదర్శనానికి భక్తులను అనుమతిస్తారు. గ్రహణానికి ఆరు గంటల ముందు ఆలయాన్నిమూసివేయం ఆనవాయితీ.

గోవిందరాజస్వామి ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు శుక్రవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామి వారి ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత యాగశాలలో విశేష పూజల అనంతరం హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. దీంతో మూడు రోజులపాటు అత్యంత వైభవంగా జరిగిన పవిత్రోత్సవాలు ముగిశాయి. సాయంత్రం ఉత్సవర్లు తిరువీధుల్లో ఊరేగింపుగా తరలివచ్చి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు.

తిరుమలలో ఎస్పీ తనిఖీలు



తిరుమల, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో ఎస్పీ హర్షవర్ధనరాజు శుక్రవారం స్థానిక పోలీసు అధికారులతో కలిసి తిరుమలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భద్రతాపరంగా ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు చేపట్టాల్సిన మరిన్ని జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆస్థానమండపం, బేడి ఆంజనేయస్వామి ఆలయం నుంచి మాడవీధుల్లోకి ప్రవేశించే మార్గాలను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రద్దీ ఆధారంగా బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి దుర్మరణం

ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

పూతలపట్టు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలం గుండ్లకట్టమంచికి చెందిన ఉమాపతి కుమారుడు హరి (34) చిత్తూరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. రాత్రి 11.35 గంటలకు పూతలపట్టు మండలంలోని ముత్తిరేవుల బ్రిడ్జి వద్దకొచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి.. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరి అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు వెళుతున్న బైక్‌లోని ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూతపట్టు సీఐ కృష్ణమోహన్ సంఘటన స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు.

ప్రమోదంలో ప్రమాదం

పరమసముద్రం చెరువులో బాలుడి గల్లంతు


విలపిస్తున్న యువన్ శంకర్ తండ్రి వెంకటేశ్‌ను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల


గల్లంతైన యువకుడు యువన్ శేఖర్

కుప్పం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో తరలివస్తున్న కృష్ణా జలాలతో నిండుకుండలా తొణికిసలాడుతున్న పరమసముద్రం చెరువులో యువన్ శేఖర్ (17) అనే యువకుడు శుక్రవారం గల్లంతయ్యాడు. కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య కథనం మేరకు....కుప్పం పురపాలక సంఘం పరిధిలోని పరమసముద్రం గ్రామానికి చెందిన వెంకటేశ్ కుమారుడు యువన్ శేఖర్ శాంతిపురంలో ఐటీఐ చదువుతున్నాడు. మిలాడి ఉన్ నబీ సందర్భంగా కళాశాలకు సెలవు కావడంతో శుక్రవారం ఉదయం ఈత కొట్టేందుకు పరమసముద్రం చెరువుకు వచ్చాడు. ముగ్గురు స్నేహితులు కలిసి నిండిన చెరువులో సరదాగా ఈత కొడుతూ పోటీలు పడి లోపలివైపు వెళ్లారు.కొంతసేపటికి తిరిగి ఒడ్డుకు చేరుకున్న ఇద్దరు స్నేహితులు యువన్ శేఖర్ బయటకు రాకపోవడంతో అతని తండ్రికి సమాచారం ఇచ్చారు. మరోవైపు సమాచారం అందుకున్న కుప్పం అర్బన్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రానికి కూడా యువన్ శేఖర్ ఆచూకీ కనిపెట్టలేకపోయారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రెస్కో ఛైర్మన్ వీజీ.ప్రతాప్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు.యువన్ శేఖర్ తల్లిదండ్రులను ఓదార్చారు.

చెరువులో పడి విద్యార్థి మృతి


యువరాజ్ మృతదేహం

నింద్ర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణం కేవీపీఆర్ పేటకు చెందిన నేత కార్మికుడు అర్మగం కుమారుడు యువరాజ్(14) చెరువులో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...9వ తరగతి చదువుతున్న యువరాజ్ శుక్రవారం సెలవు కావడంతో స్నేహితులతో కలసి గుండ్రాజుకుప్పం దళితవాడ సమీపంలో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఆట ముగిశాక మైదానానికి పక్కనే ఉన్న చెరువులో ఈతకు దిగాడు. లోతు ఎక్కువై నీట మునిగిపోవడంతో మృతి చెందాడు.యువరాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాతపేట వద్ద 14 ఏనుగుల హల్‌చల్

● మామిడి,కొబ్బరి చెట్లు సహా వేరుశనగ, అలసంద, అనప పంటలు ధ్వంసం



పెద్దవంక వద్ద సంచరిస్తున్న ఏనుగు - బాధిత రైతులతో మాట్లాడుతున్న రేంజర్ పట్టాభి

కల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పాతపేట వద్ద గురువారం రాత్రి 14 ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది.ఘీంకారాలతో పొలాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేశాయి. గురువారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి బయలుదేరిన ఏనుగుల గుంపు పాతపాళ్యం అడవిమీదుగా పాతపేట వద్దకు చేరుకున్నాయి. ఈశ్వర రెడ్డికి చెందిన ఎకరా వేరుశనగ, అరటి చెట్లు, మామిడిచెట్లు, బొప్పాయి, పనసచెట్లు, డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. 25 ఏళ్ల కొబ్బరిచెట్టును నేలమట్టం చేసిన ఏనుగులు వ్యవసాయ మోటర్‌ను కదిలించాయి.శంకర్‌కు చెందిన అర్ధ ఎకరా అలసంద పంటను ధ్వంసం చేసి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి.సురేష్, నందగోపాల్, వెంకట్రమణ, శ్రీనివాసులు, సోమశేఖర్, నటరాజ, మునిరాజకు చెందిన కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి.మామిడిచెట్లలో కొమ్మలను విరిచేశాయి.రంగన్న, దొరస్వామి, శ్రీనివాసులుకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు డ్రిప్ పైపులను ఇష్టారాజ్యంగా తొక్కేశాయి. అనంతరం వచ్చిన మార్గంలోనే ఏనుగుల గుంపు అడవిలోకి చేరుకుంది. శుక్రవారం పగలంతా తూర్పు పెద్దవంక వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.


ఏనుగుల దాడిలో నేలకూలిన కొబ్బరిచెట్టు

●ధ్వంసమైన పంటలను పరిశీలించిన రేంజర్

పులిచెర్ల మండలం పాతపేట వద్ద ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన పంటలను శుక్రవారం మధ్యాహ్నం రేంజర్ పట్టాభి, డీఆర్వో రాకేష్‌కుమార్ పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు.పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తామన్నారు. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటల వివరాలను ఎప్పటికప్పుడు సిబ్బంది పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు.

ఆగమోక్తంగా పవిత్రోత్సవాలు




పూజా ద్రవ్యాలను తీసుకెళ్తున్న అధికారులు, అర్చకులు - భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ప్రత్యేక అలంకారం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో పవిత్రోత్సవాలు మూడో రోజు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య పూజల్లో జరిగే దోషాలను నివారించి మూల విరాట్లకు పునరుత్తేజం తెచ్చే విధంగా ఈ పూజలను ఐదురోజుల పాటు నిర్వహించ ను న్నారు. మూడో రోజు ఉత్సవాల్లో ఆలయంలోని యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి విశేష అభిషేక పూజలు చేపట్టారు. పూర్ణహా రతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల రీవెరిఫికేషన్

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం స్థానిక అపోలో యూనివర్శిటీలో కొనసాగింది. ఇప్పటికే మూడు విడతలుగా అభ్యర్థులు నేరుగా ధ్రువీకరణ పత్రాలు సమర్పించి, వెరిఫికేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. కాగా రాష్ట్ర విద్యాశాఖ అధికారుల సూచనల మేరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలు, ఫిజికల్ వెరిఫికేషన్ చేసిన సమయంలో అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాలు సరిపోల్చే ప్రక్రియ సాగింది. ఇటీవల లాగే 30 టీఎంలు వారికి కేటాయించిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను రీవెరిఫికేషన్ చేస్తున్నారు.

రోటావేటర్ కింద నలిగిన పసి ప్రాణాలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోటావేటర్ కింద పడి ఇద్దరి చిన్నారులు మృతి చెందిన విషాదకర ఘటన శుక్రవారం సూళ్లూరుపేట మండలం ఆబాక గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు... ఆబాక హరిజనవాడకు చెందిన ఏలిబేటి కృష్ణయ్య ఇంటి సమీపంలో ఉన్న తోటలో దుక్కి దున్నేందుకు రోటావేటర్‌తో బయలుదేరాడు.ఇంతలో ఇంటివద్దే ఉన్న తన కుమార్తె బిడ్డ కుందన(11), కొడుకు బిడ్డ దివాన్(3)తాముకూడా వస్తామంటూ ఏడవసాగారు. దీంతో పిల్లలు ఇద్దరినీ ట్రాక్టర్‌లో వెనుక కూర్చోబెట్టుకుని పొలంలోకి తీసుకెళ్లాడు. దుక్కి దున్నుతుండగా ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు రోటావేటర్‌తో కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఇంటి వద్ద అల్లారుముద్దుగా ఆడుకుంటున్న చిన్నారులు తాతతో పాటు పొలంలోకి వెళ్లిన కాసేపటికే మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం



షోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, భానుప్రకాష్

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక డీబీఆర్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్లో శుక్రవారం క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభమైంది. తిరుపతి, నగరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగాలకు సంబంధించిన అన్ని అంశాలను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. క్రెడాయ్ ద్వారా నాణ్యమైన నిర్మాణాలతోపాటు పారదర్శకమైన అపార్టుమెంట్స్ ఆస్తులు కొనుగోలు చేయడానికి అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. 22ఏ జాబితాలో ఉన్న భూములను విడిపించి క్రెడాయ్‌కు అప్పగిస్తామన్నారు. గృహ నిర్మాణ సంబంధిత మెటీరియల్స్‌పై జీఎస్టీ కూడా తగ్గిందని గుర్తు చేశారు. మరో రెండు రోజులు కొనసాగనున్న ఈ షోను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలిరోజు ప్రజలు పెద్ద ఎత్తున స్టాల్స్‌ను సందర్శించి, సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ సంస్థ ఛైర్మన్ గోపినాథ్, ప్రెసిడెంట్ రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌బాబు, కార్యదర్శి నరసింహారెడ్డి, ట్రెజరర్ హరికృష్ణ పాల్గొన్నారు.

అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



అధ్యాపకులతో జేఎన్‌టీయూ పీడీసీ డైరెక్టర్ ప్రశాంతి

తిరుపతిరూరల్, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో క్వాంటమ్ టెక్నాలజీపై అధ్యాకులకు ఐదురోజులు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం జేఎన్‌టీయూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్(పీడీసీ) డైరెక్టర్ జి.ప్రశాంతి మాట్లాడుతూ అధ్యాపకులు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ ఎ.మునిశంకర్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని ఆకాంక్షించారు. అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కాగా టీచర్స్‌డే సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పలువురు అధ్యాపకులు పుష్పాంజలితో నివాళి అర్పించారు. కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర పాల్గొన్నారు.

సర్వీసు ఉద్యోగులను పర్మినెంట్ చేయండి



బీఆర్‌నాయుడికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగ సంఘం నేతలు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : టీటీడీలో పనిచేస్తున్న సొసైటీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఛైర్మన్ బీఆర్‌నాయుడికి ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ టీటీడీలో సుమారు 1600 మంది 15 నుంచి 30 సంవత్సరాలుగా సొసైటీ ఉద్యోగులుగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలిక సర్వీసులను పరిగణనలోకి తీసుకుని పర్మినెంటు చేయడానికి పాలకమండలి సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. అలాగే టైమ్ స్కేలు ఉద్యోగులుగా కొనసాగించి అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఛైర్మన్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు గోల్కొండ వెంకటేష్, హరిప్రసాద్, నవీన్‌కుమార్, రూపకుమార్, అమరనాథ్, ముని, శివ, రెడ్డెన్న, రాజగోపాల్, రమేష్, పురుషోత్తం, మోహన్‌శెట్టి పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల నియామక నోటిఫికేషన్ రద్దు చేయాలి



బీఆర్‌నాయుడితో చర్చిస్తున్న ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : టీటీడీలో ప్రత్యేకాధికారుల నియామక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఛైర్మన్ బీఆర్‌నాయుడికి శుక్రవారం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పనిచేస్తున్న ఉద్యోగుల అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించి, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. వడమాలపేట వద్ద టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇంటి స్థలాల్లో మౌలిక వసతు కల్పించాలని కోరారు. మిగిలిన ఉద్యోగులకూ ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఛైర్మన్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు జి.వెంకటేశం, జి.వెంకటరమణారెడ్డి, జె.భాస్కర్, ప్రసాదరావు, వాసు, ఇందిర, మహేష్, కృష్ణమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



తిరుమలయ్యను సన్మానిస్తున్న రాయలసీమ రంగస్థలి కళాకారులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి కళాకారుల ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు తిరుమలయ్యను శుక్రవారం ఘనంగా సన్మానించారు. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కేఎస్‌రాజా, తులసీరామ్, ఈశ్వర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సురేష్‌స్వామి, ఆదిస్వామి, రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ జనార్దన్‌రెడ్డి, వినాయకరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

8న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఈనెల 8వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా గల ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ప్రారంభం కానుంది. మహీంద్రా, జైహింద్ ఇండస్ట్రీస్, ఆనంద గ్రూప్ ఆఫ్ కంపెనీస్, హిటాచి, ఎస్‌బీబీ గ్రూప్ వంటి కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఈ మేళా నిర్వహించనున్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, ఐటీఐ, ఫార్మసీ, బీటెక్ చదువుకున్న 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులు. సమగ్ర సమాచారం కోసం 9533889902లో సంప్రదించవచ్చు.

భారీ ధర పలికిన వినాయకుడి లడ్డు



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఎల్బీనగర్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా గురువారం రాత్రి నిర్వహించిన వేలంలో వినాయకుడి లడ్డుకు భారీ ధర లభించింది. శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన శ్రీనివాస హరిహరన్ అనే భక్తుడు వేలంలో రూ.1,06,100లకు లడ్డును దక్కించుకున్నారు. ఈ లడ్డును కాలనీ యువత తయారు చేశారు.

అన్నదానం



తిరుపతి(ఉపాధ్యాయ నగర్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని తిరుపతి ఏ1 క్యాటరింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో అన్నదానం చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి గౌస్ ఆశ్రమ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు క్వాజా జుబేర్ హయత్ ఖాదరి ముఖ్య అతిథిగా హాజరై అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

సీబీఎస్ ఉద్యోగుల్లో టెన్షన్

- ప్రత్యామ్నాయం చూపకనే మరమ్మతు పనులు చేస్తుండటంపై ఆందోళన
- వేరే చోటుకు మార్చాలని వేడుకోలు







సీబీఎస్‌లో స్లాబ్ కూల్చివేత - ఖాళీ అయిన కార్గో కేంద్రం - ఏపీ, కర్ణాటక టిక్కెట్ బుకింగ్ రిజర్వేషన్ కౌంటర్లు, ఏటీఎం కార్యాలయం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పునరుద్ధరణ పనులు చేపట్టారు. తొలివిడతలో ప్లాట్‌ఫామ్ 1నుంచి 5వరకు పెచ్చు లూడుతుండడంతో పైకప్పు తొలగించారు. దాని స్థానంలో ఉన్న కార్గో కేంద్రం, రెండు దుకాణాలను పక్కనే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులోకి మార్చారు. అయితే ఏపీ, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు అడ్వాన్సు రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్స్, ఏటీఎం కార్యాలయం, ఓ హోటల్ అక్కడే కొనసాగుతున్నాయి. వీటిని బయటకు పంపడానికి చేస్తున్న మరమ్మతు పనులు మందకొడిగా సాగుతున్నాయి. అయితే మరోవైపు స్లాబ్ తొలగింపు పనులు చేస్తుండటంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని అధికారులు, సిబ్బంది, టిక్కెట్ బుకింగ్ కోసం వస్తున్న ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. పైగా రిజర్వేషన్ కౌంటర్ల చుట్టూ పరదాలు ఏర్పాటుచేసి ప్రవేశం లేదని బోర్డులు పెట్టారు. లోపల టిక్కెట్ బుకింగ్ కౌంటర్ ఉండడంతో ఏమి చేయాలో తెలియక ప్రయాణికులు తికమకచెందుతున్నారు. దీంతో కొన్ని రోజులుగా అడ్వాన్సు బుకింగ్ రేషియో కూడా బాగా తగ్గిపోయింది. తమకో షెల్టర్ చూపండి మహాప్రభో అంటూ ఇంజనీరింగ్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.



రిజర్వేషన్ కౌంటర్ చుట్టూ పరదాలు కట్టి ప్రవేశం లేదని పెట్టిన బోర్డులు

కుమారుడి అరెస్టు భయంతోనే..!

- మంత్రి లోకేశ్‌పై సజ్జల ఆక్రోశం
- శాప్ ఛైర్మన్ రవినాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో తన కుమారుడు భార్గవ్‌రెడ్డి అరెస్టు ఖాయమనే సంకేతాలు అందడంతోనే వైసీపీకి చెందిన సజ్జల రామకృష్ణారెడ్డి అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆరోపించారు. మంత్రి లోకేశ్‌పై విమర్శలు చేస్తూ తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తీగలాగితే డొంక కదలినట్లు లిక్కర్ స్కామ్‌లో సిట్ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. మోహిత్‌రెడ్డికి చెందిన భీమ్ స్పేస్ కంపెనీలో తనిఖీలు చేస్తే సజ్జల భార్గవరెడ్డి వ్యవహారం బయటపడిందన్నారు. దీనిని పక్కదారి పట్టించి కుమారుడిని కాపాడుకునే ప్రయత్నంలో బ్యాంకు అకౌంట్ లేని భీమ్ డొల్ల కంపెనీ అని సజ్జల అంగీకరించారని చెప్పారు. స్పష్టంగా ఆధారాలు కనిపిస్తుంటే స్కామే జరగలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తిరుపతి అర్బన్ తిమ్మినాయుడుపాళెం వద్ద 85, 85, 96లతో పాటు తదితర సర్వేనంబర్లలో సజ్జల భార్గవరెడ్డి బినామీ చక్రపతి ప్రద్యుమ్న అభివృద్ధి పేరుతో రైతుల నుంచి భూమిని తీసుకున్నారన్నారు. దీనికి ప్రజాధనంతో నాలుగు వరసల రహదారి నిర్మించడంపై సజ్జల సమాధానం చెప్పాలన్నారు. సజ్జల టైం కూడా దగ్గరపడిందని తప్పులు చేసిన వారి విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుందన్నారు. తిరుపతి పార్లమెంటు తెలుగుయువత అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత లేకపోయినా వైసీపీతోపాటు వారి అనుకూల మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మహేష్ యాదవ్, హేమంత్ రాయల్, వాసు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసమ్మేళనాన్ని జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వామిజీలు, న్యాయవాదులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఈ సమ్మేళ నానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. శ్రీనివాసమంగాపురం లలితా పీఠాధిపతి స్వస్వరూపానంద స్వామి, నెల్లూరుకు చెందిన మహేష్ స్వామి మాట్లాడుతూ మన పూర్వీకులు హిందూ ఆలయాలు, మఠాలు, మందిరాల సంరక్షణకు భూములను మాన్యాలుగా ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం అవి అన్యాక్రాంతమయ్యాయని, వీటి పరిరక్షణలో భాగంగా హిందూ న్యాయవాదుల సంస్థ ఏర్పడిందని అన్నారు. ధర్మ సమ్మేళనంలో దీనిపై చర్చించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులు కృష్ణకుమార్, బార్ కౌన్సిల్ సభ్యులు మాధవి, రవిశంకర్, రవి పాల్గొన్నారు.

ఎస్వీయూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడితో విశ్రాంతాచార్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ రిటైర్డు అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సెనెట్ హాల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పాల్గొని మాట్లాడారు. విలువైన ఉపాధ్యాయ వృత్తిలో సేవచేసి రిటైర్డు అయిన వారంతా ఆరోగ్యంగానూ, ఆనందంగానూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతాచార్యుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాపారావు, కృష్ణమూర్తి, విశ్రాంతాచార్యులు పాల్గొన్నారు.

విలువలు కలిగిన వారే గొప్ప గురువులు

విలువలను పాటించే వారే గొప్ప గురువులని పద్మావతి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ పేర్కొన్నారు. కాలేజీలో శుక్రవారం చేపట్టిన ఉపాధ్యాయ దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. జీవిత పాఠాలు నేర్పి విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయులు కారకులు కావాలన్నారు.

రఘునాథ్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



తిరుపతి(విద్య), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి తంబువానిగుంట నగరపాలక ఉన్నత పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు రఘునాథ్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, డీఈవో కేవీఎన్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

నేటి నుంచి సౌతిండియా రోల్‌బాల్ టోర్నీ



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తమిళనాడు నామక్కల్లో శని, ఆదివారాల్లో అండర్ 11 సౌతిండియా రోల్‌బాల్ టోర్నమెంటు నిర్వహించనున్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రోల్‌బాల్ క్రీడాకారుల జెర్సీని ఆవిష్కరించారు. టోర్నీలో రాణించి విజయవంతంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులు తమిళనాడుకు బయల్దేరారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్, ప్రేమ్‌నాథ్, కావ్యశ్రీ, నితిన్, ఇమ్రాన్, అనిల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల నుంచి ప్రజలకు రక్షణ కల్పించండి



యోగానంద్

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హిజ్రాల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని శ్రీకాళహస్తి సమాచార హక్కు చట్టం సంస్థ కార్యదర్శి ఆర్‌డీ. యోగానంద్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి లో కొంతమంది హిజ్రాలు డబ్బుల కోసం ప్రజలను వేధింపులకు గురిచేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అర్ధనారీశ్వరుడి స్వరూపంగా హిజ్రాలను భావిస్తున్నామని, అయితే కొంతమంది ఆగడాలతో చెడ్డపేరు తీసుకువస్తున్నారని తెలిపారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రేమపేరుతో మోసం చేశాడు

- న్యాయం చేయాలని యువతి వేడుకోలు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : 'ప్రేమ పేరుతో వెంటపడి నమ్మించాడు.. తాళికట్టి అవసరం తీరాక కాదు పొమ్మంటున్నాడు. పోలీసులను ఆశ్రయించినా ఫలితం కనిపించడం లేదు. న్యాయం చేయండి' అని ఒక యువతి వేడుకుంది. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ పూతలపట్టుకు చెందిన తాను జీవనోపాధి కోసం ఏడాది కిందట తిరుపతికి వచ్చి అన్నమయ్య సర్కిల్‌లోని డిమార్ట్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నానని తెలిపింది. ఆటోనగర్‌కు చెందిన వినయ్‌కుమార్ డిమార్ట్‌కు వస్తూపోతూ ప్రేమపేరుతో వెంటపడి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని పేర్కొంది. దీనిపై నిలదీస్తే సరైన సమాధానం చెప్పకపోవడంతో కొన్ని రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని వివరించింది. ఈ క్రమంలో అయిష్టంగానే తన మెడలో తాళి కట్టి వెళ్లిపోయాడని, తర్వాత అతని నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో న్యాయం కోసం ఈస్టు పోలీసులను ఆశ్రయించినా ఫలితం కనిపించలేదని తెలిపింది. వినయ్‌కుమార్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించి, న్యాయం జరిగేలా చూడాలని వేడుకుంది.

9న రైతు సమస్యలపై పోరాటం : వైసీపీ

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యలపై ఈనెల 9వ తేదీన స్థానిక ఆర్డీవో కార్యాలయాల వద్ద పోరాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తిరుపతి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త భూమన అభినయ్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని కోరారు. వైసీపీ నేతలు చంద్రమౌళిరెడ్డి, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరి బలిజ జీవోను రద్దు చేయాలని వినతి



డీటీకి వినతిపత్రం సమర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

చంద్రగిరి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గిరి బలిజ జీవోను రద్దు చేయాలని జాతీయ కాపు సంఘం నేతలు డిప్యూటీ తహసీల్దార్ దివాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దొమ్మరి కులాన్ని గిరి బలిజ పేరుతో జీవో విడుదల చేసిందన్నారు. ఇలా చేయడం వల్ల బలిజ కులానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కావున వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కాపు సంఘం కమిటీ కార్యదర్శి గోపిరాయల్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్‌గోపిరాయల్, చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షుడు కుంచా మునిచంద్రరాయల్, మండల నాయకులు మునిరత్నంరాయల్, మాజీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తి పాల్గొన్నారు.

అక్టోబరు 5న భక్త కనకదాసు విగ్రహావిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కురువ, కురబ సంఘం సభ్యులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక పూర్ణకుంభం కూడలిలో అక్టోబర్ ఐదో తేదీన భక్త కనకదాసు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు జిల్లా కురవ, కురబ సంఘం సభ్యులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆ కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి అపరభక్తుడైన కనకదాసు విగ్రహం తిరుపతిలో ఏర్పాటు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంలతోపాటు పలువురు మంత్రులు హాజరుకానున్న ఈ కార్యక్రమానికి కురబ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బీజేపీ కార్యాలయంలో గురుపూజోత్సవం



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): భారత రెండవ రాష్ట్రపతి, తత్వవేత్త, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని రాఘవేంద్ర నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ అధ్యక్షతన రాధాకృష్ణన్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి నివాళులర్పించారు. సామంచి మాట్లాడుతూ గురువుల గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు సర్వేపల్లి అని కొనియాడారు. జల్లి మధుసూదన్ మాట్లాడుతూ గురువుల వల్లే సంస్కారం, విజ్ఞానం, నైతికత, విలువలు అలవడుతాయని చెప్పారు. బీజేపీ నాయకులు గాలి పుష్పలత, బాలాజీ, పెనుబాల చంద్రశేఖర్, జయంత్‌కుమార్, రూపేష్‌బాబు, నరేష్, మల్లకుప్ప శేఖర్, శ్రీధర్, ఇంద్రారెడ్డి, జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాలలో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహా ముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

శ్రీవారి సేవలో మరింత నాణ్యత: టీటీడీ ఈవో



తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): ఇటీవల చేపట్టిన సంస్కరణల వల్ల శ్రీవారిసేవలో నాణ్యత పెరుగుతుందని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. శ్రీవారిసేవకులకు గ్రూప్ సూపర్‌వైజర్లు, ట్రైనర్లకు శిక్షణ మాడ్యూల్‌పై శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో సమీక్ష నిర్వహించారు. శిక్షణ మొదటి విడత కార్యక్రమం ఈనెల 24 నుంచి ప్రారంభమై మూడురోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఏపీ ప్లానింగ్ విభాగం ఈడీ వెంకటేశ్వరావు, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వర్చువల్‌గా ఐఐఎం అహ్మదాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు విశ్వనాథ్, రామమోహన్, అదనపుఈవో వెంకయ్య చౌదరి ఈసమీక్షలో పాల్గొన్నారు.

తిరుమలలో నేడు అనంతపద్మనాభ వ్రతం

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం అనంతపద్మనాభ వ్రతం జరుగనుంది. ఉదయం 6 గంటలకు శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా వరాహస్వామి ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్వామి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించి తిరిగి ఆలయానికి తీసుకువస్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజున, వైకుంఠ ద్వాదశి, రథసప్తమి రోజుల్లో కూడా చక్రస్నానం నిర్వహిస్తారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,834

తలనీలాలు సమర్పించినవారు: 24,628

శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ



అమ్మవారికి హారతులు ఇస్తున్న అర్చకులు

తిరుచానూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు పవిత్ర ప్రతిష్ఠతో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీపద్మావతి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలో అమ్మవారిని మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు ఉదయం ఉత్సవర్లను ఆలయం నుంచి యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం ద్వార తోరణ, ధ్వజ కుంభ ఆవాహనం, చక్రాది మండల పూజ, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించి, విశేషంగా అలంకరించారు. పవిత్రోత్సవాలను పురస్కరించకుని ఆలయంలో పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, మణికంఠ స్వామి, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. పవిత్రోత్సవాల్లో రెండో రోజైన శనివారం శనివారం పవిత్ర సమర్పణ ఉంటుంది.



యాగశాలలో ప్రత్యేక పూజలు

శ్రీవారి సేవలో ప్రముఖులు



బన్వరిలాల్ వర్మ

తిరుమల,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్రమంత్రి బన్వరిలాల్ వర్మ, తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు ఉన్నారు.

పద్మావతి అమ్మవారి సేవలో తెలంగాణ హైకోర్టు సీజే



ఆలయం వద్ద తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్

తిరుచానూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం తెలంగాణ హైకోర్టు సీజే జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, వేదపండితులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, శాంతారాం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల్లో ఆనందం వెల్లువ

- ఎద క్రమబద్ధీకరణ పథకంతో సత్ఫలితాలు
- స్వర్ణ నారావారిపల్లెలో తొలిదశలోనే 61 శాతం విజయవంతం



ఎద క్రమబద్ధీకరణ, చూలు కట్టించేందుకు రైతులు తీసుకువచ్చిన పశువులు

చంద్రగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత గ్రామం నారావారిపల్లె క్లస్టర్ పరిధిలో పాడిరైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ క్లస్టర్ పరిధిలో ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం పంచాయతీలున్నాయి. సీఎం సంకల్పం మేరకు స్వర్ణ నారావారిపల్లె పైలెట్ ప్రాజెక్టులో క్లస్టర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదాయాభివృద్ధితో స్వావలంబన సాధించేలా పథకాలు రూపొందించారు. ఇప్పటికే నారావారిపల్లెలో అత్యధిక సౌరవిద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే ఇటీవల జిల్లా కలెక్టర్ స్కోచ్ అవార్డు కు ఎంపికయ్యారు. అదేవిధంగా పశు సంవరక్షశాఖ ఆధ్వర్యంలోని ఎద క్రమబద్ధీకరణ పథకం క్లస్టర్ పరిధిలో పాడిరైతులకు వరంగా మారింది. గతంలో చూలు కట్టని పశువుల పోషణ రైతులకు ఆర్థిక భారమయ్యేది. పశువులను మేపడం కష్టమై ఒక్కోసారి కోతకు కూడా విక్రయించేవారు. పశువు ఏటా ఈనితేనే లాభమొస్తుంది. ఈనేపథ్యంలో ఈ ఏడాది మార్చి చివర్లో ఎద క్రమబద్ధీకరణ పథకం కింద 171 మంది రైతులకు చెందిన 218 పశువులను ఎదకు రానివిగా గుర్తించారు. 50 శాతం రాయితీతో రూ.400 కట్టించుకుని రూ.1100 విలువ గలదాణా, ఖనిజలవణ మిశ్రమం, లవణ మాత్రలు, హార్మోను ఇంజక్షన్లు తదితర మందులను రైతులకు అందించారు. ఇవి చూలు కట్టడానికి దోహదపడుతున్నాయి. నిత్యం సుమారు 25 మంది సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈనెల మొదటి వారం పరీక్షించగా 134 పశువులు ఎదకు వచ్చినట్లు గుర్తించామని పశువైద్యాధికారి తెలిపారు. మొదటి విడతలోనే 61 శాతం మేర సానుకూల ఫలితాలను రావడంతో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాల ఉత్పత్తి పెంపు లక్ష్యం



క్లస్టర్ పరిధిలోని పశువులలో పాల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. మొదటి విడతలోనే 61 శాతం ఫలితాలను రాబట్టాం. నాలుగు విడతల్లో వెయ్యి పశువులకు చూలు కట్టించాలనేది ఉద్దేశం. కొత్త పథకం కింద అదనంగా 4200 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుంది. సంవత్సరానికి రూ.73 లక్షల మేర అదనపు ఆదాయం చేకూరుతుంది.

-డాక్టర్ వంశీ, పశు వైద్యాధికారి, నారావారిపల్లె

గతంలో ఎన్నో ఇబ్బందులు



ఎద క్రమబద్ధీకరణ, చూలు కట్టించడం పాడి రైతులకు వరం. గతంలో కృత్రిమ గర్భధారణకు చాలా ఇబ్బందులు పడ్డాం. ఎదకు రాని పశువులను మేపడం కష్టంగా ఉండేది. ఆర్థికంగా దెబ్బతిని పశువులను కోతకు ఇచ్చేవాళం. సీఎం చంద్రబాబు చొరవ వల్ల కొత్త పథకంతో ఆర్థికంగా నిలబడతామని నమ్మకం కలిగింది

- చంద్రబాబునాయుడు, భీమవరం

రెండు విధాలా ఆదాయం



ఎదక్రమబద్ధీకరణ పథకం ద్వారా చూలు కట్టిన పశువును అమ్ముకోవాలన్నా రెండింతలు హెచ్చు ధర పలుకుతుంది. చూలు కట్టిన పశువు రైతు దగ్గరే ఉంటే పాల ఉత్పత్తి రెండింతలు పెరుగుతుంది. ఇలా రెండు రకాలూ ఆర్థికంగా ఆదాయం ఉంటుంది. ఈ పథకంతో పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

- సుబ్రమణ్యంయాదవ్, ఎ.రంగంపేట

8 ఎర్రచందనం దుంగల స్వాధీనం

- ఒక కారు సీజ్



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అటవీశాఖ అధికారులు

మంగళం, సెప్టెంబరు5(ఆంధ్ర జ్యోతి): రేణిగుంట-మామండూరు మార్గంలో శుక్రవారం తిరుపతి రేంజ్ అటవీశాఖ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 8ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ కారును సీజ్ చేశారు. తిరుపతి రేంజర్ సుదర్శన్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు గురువారం రాత్రి నుంచి ఆ మార్గంలో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించారు. పులిచెర్ల వద్ద వేగంగా వస్తున్న ఏపీ 39 సి7116 నెంబరు కారును ఆపే ప్రయత్నం చేయగా వారు ఆపలేదు. దీంతో వాహనాన్ని వెంబడించారు. చైతన్యపురం చెక్‌పోస్టు సమీపంలో కారును ఆపి డ్రైవర్ పారిపోయాడు. అధికారులు కారులో పరిశీలించగా 8ఎర్రచందనం దుంగలు ఉన్నాయి.కారు సహా దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ దుంగలు, కారు విలువ రూ.5లక్షలుఉంటుందని రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఆర్ఎస్ చైతన్య, ఎఫ్‌బీవో చెంగ్రాయ నాయుడు, ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రి, వెంకట్, రవి, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.





ఈశ్వర్ ఇంట్లో పగలగొట్టిన బీరువా - గీత ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

రెడ్డివారిపల్లెలో చోరీ

రూ.40వేలు నగదు, 20 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి అపహరణ

చంద్రగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ రెడ్డివారిపల్లెలో చోరీ జరిగింది. నగలు, నగదు అపహరణకు గురైంది. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈశ్వర్ తన తండ్రికి అనారోగ్యం కారణంగా ఇంటికి తాళాలు వేసుకొని గురువారం తిరుపతికి వెళ్లారు. గ్రామానికి చెందిన గీతా కుటుంబ సభ్యులు వేరే ఊరికి వెళ్లడంతో ఆమె అదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండిళ్లలో తాళాలు పగలగొట్టి ఈశ్వర్ ఇంట్లో 40 వేలు నగదు, గీతా ఇంట్లో 20 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి చోరీ చేశారు, శుక్రవారం ఉదయం ఇంటికి చేరుకున్న ఇరు కుటుంబాల వారు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో వచ్చి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని మోసం

- రూ.70వేలు తీసుకున్న దళారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు



కార్తీక్

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని నమ్మించి మోసగించిన ఓ దళారీని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లాలోని వెంగలాయపాలెంకు చెందిన హరి నాగసాయి కార్తీక్ కొన్నేళ్లుగా భక్తులను మోసగిస్తూ అందినవరకు దోచుకుంటున్నాడు. ఇటీవల ఫేస్‌బుక్‌లో 'శ్రీప్రభాకర చార్యులు' అనే నకిలీ ఖాతాను తెరిచాడు. తాను తిరుమలలో సహాయ అర్చకుడినని, బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవ టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి మోసం చేయడం మొదలుపెట్టాడు. ఆదిత్య, హరికృష్ణ, నాగార్జున అనే మరో ముగ్గురి సహాయంతో బ్యాంకు ఖాతాలు కూడా తెరిచాడు. ఈ ముఠా తిరుపతికి చెందిన విజయ్ అనే భక్తుడికి నాలుగు సుప్రభాతసేవ టికెట్లు ఇప్పిస్తామని చెప్పి రూ.70,070 తీసుకున్నారు. ఆ తర్వాత ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితుడు ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్‌బాబు, చలపతి ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుమలలోని కర్ణాటక సత్రాల వద్ద కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్దనున్న రూ.1.03 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీన పరుచుకున్నారు. ఇప్పటికే కార్తీక్‌పై తిరుమల వన్‌టౌన్, టూటౌన్‌లో రెండు కేసులు, తిరుపతి ఈస్ట్‌లో మరో కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే 16 మంది ఎన్ఆర్ఐ భక్తులకు అభిషేకం టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.36 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో జైలుకు వెళ్లి.. బెయిల్‌పై వచ్చిన కార్తీక్.. మళ్లీ భక్తులను మోసగించడం మొదలుపెట్టాడని పోలీసులు తెలిపారు.

నాదస్వర డోలు విద్యార్థులకు
డిపాజిట్ చెక్కుల పంపిణీ



అందుకున్న డిపాజిట్ చెక్కుతో నాదస్వర డోలు విద్యార్థులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వెంకటేశ్వర సంగీత, నృత్య కళాశాలలో నాదస్వర డోలు విద్యార్థులకు డిపాజిట్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. 2017-2023, 2018-2024 విద్యాసంవత్సరంలో ఆరేళ్లపాటు సర్టిఫికెట్ డిప్లొమా కోర్సులో ఉత్తీర్ణులైన డోలు విద్యార్థులకు రూ.46.20లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా డోలు విద్యార్థులు వెంకటేశ్వరస్వామికి తమ డోలు విద్య ద్వారా నాదాంజలి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమాముద్దబాల, నాదస్వర పాఠశాల హెచ్ఐ బి.లక్ష్మి సువర్ణ, విద్యాశాఖ డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ శివకుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

జిల్లాలో విభాగాల వారీగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను 68 అందుకున్నారు. వీరిలో ఉపాధ్యాయులు, ఎంఈవోలు ఉన్నారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

హెచ్‌ఎం కేటగిరీ : జి.రామచంద్రయ్య, జడ్పీహెచ్ఎస్, పంగూరు, ఏర్పేడు మండలం.. పి.చిన్నబాబు, జడ్పీహెచ్ఎస్, ఇరుగులం, సత్యవేడు మండలం.. ఎం.కృష్ణవేణి, పీఎస్‌హెచ్‌ఎం, ఎంసీపీఎస్, టీపీ ఏరియా, తిరుపతి.. వి.హరినాథ్, పీఎస్‌హెచ్‌ఎం, ఎంపీఎల్ ఎంపీఎస్, కైలాసగిరి కాలనీ, శ్రీకాళహస్తి.

స్కూల్ అసిస్టెంట్: జి.తేజోవతి, ఇంగ్లిష్, జడ్పీహెచ్ఎస్, తిరుచానూరు, తిరుపతి రూరల్. డి.రఘునాథ్, తెలుగు, జడ్పీహెచ్ఎస్, దామలచెరువు, పాకాల. వి.వెంకటరమణ, ఇంగ్లిష్, ఎంపీపీఎస్, టీపీ కోట, నాగలాపురం. ఎ.సుజాత, సోషల్, జడ్పీహెచ్ఎస్, చెందోడు, కోట. డి.శ్రీనివాసులు, పీఈటీ, జడ్పీహెచ్ఎస్, కరకంబాడి, రేణిగుంట. ఎం.జయంతి, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, చిట్టేడు, కోట. ఎం.సుబ్బరామయ్య, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, వరదాయపాళెం. కె.సువర్ధన, ఫిజికల్ సైన్స్ జడ్పీహెచ్ఎస్, చెందోడు, కోట. పి.కిషోర్‌కుమార్, పీఈటీ, జడ్పీహెచ్ఎస్, ముచివోలు, శ్రీకాళహస్తి. సి.వాసు, ఇంగ్లిష్, జడ్పీహెచ్ఎస్, తిరుచానూరు, తిరుపతి రూరల్. కె.గోపి, సోషల్, ఎంపీఎస్, వడిమిట్ట, ఏర్పేడు. జె.చంద్రశేఖర్, బయాలజీ, జడ్పీహెచ్ఎస్, రంగన్నగిరిగడ్డ, చిన్నగొట్టిగల్లు. యు. పురుషోత్తం, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, దామలచెరువు, పాకాల. వీవీఎస్ఎస్ రాధామదనం, తెలుగు, పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్, మంగళం ట్రెండ్, తిరుపతి. ఎ.గోపి, సోషల్, జడ్పీహెచ్ఎస్, పాలమంగళం, నారాయణవనం. పి.రుద్రయ్య, ఫిజికల్ సైన్స్, జడ్పీహెచ్ఎస్, చిట్టత్తూరు, తొట్టంబేడు. ఎన్‌వీ లత, తెలుగు, జడ్పీహెచ్ఎస్, సంతవేలూరు, వరదాయపాళెం. సి.దామోదరం, హిందీ, జడ్పీహెచ్ఎస్, రాజానగరం, పిచ్చాటూరు. జి.జగదీష్, ఇంగ్లిష్, జడ్పీహెచ్ఎస్, పుడుకుప్పం, సత్యవేడు. కె.మునస్వామి, తెలుగు, జడ్పీహెచ్ఎస్, పల్లమాల, బీఎన్ కండ్రిగ. కె.శంకరయ్య, హిందీ, జడ్పీహెచ్ఎస్, కొక్కుపాడు, కోట. కె.రఘునాథ, సోషల్, ఎంసీహెచ్ఎస్, టీవీ గుంట, తిరుపతి. జి.రాజేశ్వరి, సోషల్, జడ్పీహెచ్ఎస్ గర్ల్స్, పుత్తూరు.

ఎస్జీటీ కేటగిరీ: ఎస్ఎస్ కృష్ణప్రియ, ఎంపీపీఎస్, సి గొల్లపల్లి, తిరుపతి రూరల్. వి.వెంకట నాగులు, ఎంపీఎస్ కోటాల, చంద్రగిరి. కె.రామిరెడ్డి, ఎంపీపీఎస్, పాతపేట, చంద్రగిరి. కె.మమత, ఎపీపీఎస్, పద్మావతిపురం, తిరుపతి రూరల్. కె.సురేష్, ఎపీపీఎస్, వాకాడు. టి.మురుగయ్య, ఎంపీపీఎస్, నాగులచెరువు, చంద్రగిరి. కె.బాలాజీ, ఎంపీపీఎస్, పిచ్చాటూరు. ఎం.శైలజ, ఎంపీపీఎస్, మల్లయ్యపల్లి, చంద్రగిరి. పి.శ్రీనివాసరావు, ఎంపీపీఎస్, ముట్టెంబాక, వాకాడు. పి.పుష్ప, ఎంపీపీఎస్, వడమాలపేట. బి.నాగరాజు, ఎంపీపీఎస్, నెరబైలు, ఎర్రావారిపాళెం. ఎల్.వెంకటశారద, ఎంపీఎస్, పల్లెపాళెం, తడ. డి.పుష్పకిరణ్, ఎంపీపీఎస్, సీహెచ్ నిడిగల్లు ఎస్టీ. శ్రీకాళహస్తి. జి.మురళి, ఎంపీపీఎస్, పాపన్నపల్లె, శ్రీకాళహస్తి. ఎస్.రత్నప్రభ, ఎంపీపీఎస్, కండలవారిపల్లి, డక్కిలి. సి.మానస, ఎంపీపీఎస్, భాగ్యనగరం, తిరుపతి రూరల్. పి.లక్ష్మీదేవి, ఎంపీపీఎస్, పోలిచెట్టిగారిపల్లె, పాకాల. ఎం.వెంకటస్వామి, ఎంపీఎస్ సి. మల్లవరం, తిరుపతి రూరల్. జి.పరంధామయ్య, ఎంపీఎస్ హెచ్‌డబ్ల్యు, కొట్టంబేడు, బాలాయపల్లి. ఆర్.మరియమ్మ, ఎంపీఎస్, ఉత్తమ నెల్లూరు, కోట. ఎం.సుబ్రహ్మణ్యం, ఎంపీపీఎస్, నెల్లటూరు మెయిన్, గూడూరు. బి.వెంకటాద్రి, ఎంపీపీఎస్, రెడ్డివారిపల్లె, ఎర్రావారిపాళెం. కె.ఆదినారాయణ, ఎంపీపీఎస్, ఏర్పేడు. డి.జగదీశ్వరి, ఎంపీఎస్, మనులాలుపేట, వెంకటగిరి. ఎం.తిరుమల కొండయ్య, ఎంపీపీఎస్, కాపులూరు మెయిన్. నాయుడుపేట. ఎస్‌కే బాబూలాల్, ఎంపీపీఎస్, కొత్త కండ్రిగ, తొట్టంబేడు. ఆర్.మంజులా దేవి, ఎంపీపీఎస్, తోలుమిట్ట, వెంకటగిరి. ఎం.ప్రభు, ఎంపీపీఎస్, చిన్నగోర్పాడు. పాకాల. వై.మునికుమార్, ఎంపీపీఎస్, తిరువత్యమ్, నారాయణవనం. కె.వినయ్‌కుమార్, ఎంపీపీఎస్, కొత్తపల్లె, దొరవారిసత్రం. వి.సుధాకర్, ఎంపీపీఎస్, తంగేళ్లపాళెం, తొట్టంబేడు. సి.గురవారెడ్డి, ఎంపీపీఎస్, చిందేపల్లి, ఏర్పేడు.

మండల విద్యాశాఖాధికారులు

జి.ఇందిరాదేవి, రేణిగుంట. కె.భాస్కర్‌బాబు, చంద్రగిరి. బి.తిరుమల రాజు, పుత్తూరు. కె.రవీంద్రనాథ్, బీఎన్ కండ్రిగ. బి.మునిరత్నం, నాయుడుపేట. కె. మల్లిఖార్జునరావు, తడ.

కేజీబీవీ కేటగిరీలో: పి. సతీ సావిత్రి, సీఆర్టీ పీఈటీ.

కార్డుదారులకు నెలంతా రేషన్

- త్వరలో రానున్న ఉత్తర్వులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌకధర దుకాణాలను నెలంతా తెరచి ఉంచనున్నారు. ఈ నెల వ్యవధిలో ఎప్పుడైనా కార్డుదారులు సరుకులు కొనుగోలు చేసుకోవచ్చు. దీనికి సంబంధించి ఏర్పాట్లు జరుగుతుండగా, త్వరలో ఉత్తర్వులు రానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1457 రేషన్ షాపులు.. దాదాపు 5,81,145 స్మార్ట్ కార్డులు వున్నాయి. ప్రస్తుతం ప్రతి నెలా 1 నుంచి 15వ తేది వరకు రేషన్ దుకాణాల నుంచి నిత్యావసర వస్తువులు తీసుకోవచ్చు. వివిధ పనులపై ఇతర ప్రాంతాలకు కూలీలకు వెళ్ళిన వారు ఈ సమయంలో రేషన్ తీసుకోలేక పోతున్నారు. అలా తీసుకోని నెలలో బియ్యం, పంచదార వంటి నిత్యావసర వదులుకోవాల్సి వస్తోంది. ఇక, నగరాలు, పట్టణాల్లో పోర్టబులిటీ విధానం వల్ల ప్రతి నెలా పదో తేది వచ్చే సరికే పలు దుకాణాల్లో బియ్యం అయిపోతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కార్మికులు కారణంగా ఇలాంటి పరిస్థితి నెలకొంది. తిరుపతిలోని 67 శాతం దుకాణాల్లో ఐదో తేదీకే బియ్యం అయిపోయి రేషన్ దుకాణాలకు తాళాలు పడుతున్నాయి. ఆ షాపుల పరిధిలోని కార్డుదారులకు బియ్యం అందని పరిస్థితి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నెలంతా రేషన్ సరుకులు ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. త్వరలో నెలంతా రేషన్ సరకులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు చెప్పారు. త్వరలో ఉత్తర్వులు వస్తాయని దీని తర్వాత అందులో పేర్కొన్న విధంగా జిల్లాలో రేషన్ దుకాణాలన్నీ తెరచి ఉంచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా, వచ్చే నెల నుంచి ఉచిత బియ్యంతో పాటు నగదుకు చక్కెర, కందిపప్పు, నూనె, రాగులు, గోధుమపిండి, ఇవ్వడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

అక్టోబరు 7న భవ్య గుజరాత్ యాత్ర

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట రైల్వేస్టేషన్ నుంచి అక్టోబరు 7వ తేదీన భవ్య గుజరాత్ యాత్రకు ప్రత్యేక రైలు బయలుదేరుతుందని ఏరియా మేనేజర్ కె.వేణుగోపాల్ తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ యాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ యాత్రలో ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్, మొథేరా, సూర్యదేవాలయం, సబర్మతి ఆశ్రమం, సబర్మతి నదీ తీరం, యునెస్కో వారసత్వ స్థలం రాణికి వావ్, ప్రపంచ ప్రఖ్యాత స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక క్షేత్రాలను దర్శించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ యాత్రా రైలు రేణిగుంట నుండి ప్రారంభమై గూడూరు, నెల్లూరు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్, నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి అదే మార్గం ద్వారా రేణిగుంటకు చేరుతుందన్నారు. ప్రయాణికులకు వసతితో పాటు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, శాకాహార భోజనం, వాటర్ బాటిల్ వంటి సౌకర్యాలతో పాటు ప్రయాణ బీమా కూడా కల్పించినట్లు వివరించారు. టిక్కెట్టు ధరలు స్లీపర్ క్లాస్ రూ.18,400లు, త్రీటైర్ ఏసీ రూ.30,200లు, టూటైర్ ఏసీ రూ.39,900లుగా నిర్ణయించినట్లు తెలిపారు. పది రోజులపాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. టిక్కెట్టు బుకింగ్ కోసం కె.పవన్‌కుమార్‌ను 9281495853, యేసయ్యను 8287932313 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌బాబు, వీరన్న, కోదండం, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న రైల్వే అధికారులు

పుత్తూరు వార్తలు

కుమార్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



పుత్తూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్‌వికుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులను విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ అందించారు.

తిరుమలరాజుకు ఉత్తమ ఎంఈవో అవార్డు



పుత్తూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఎంఈవోగా పుత్తూరు మండల ఎంఈవో తిరుమలరాజు అవార్డు అందుకున్నారు. తిరుపతిలో జరిగి కార్యక్ర మంలో పుత్తూరు ఎమ్మెల్యే భాను ప్రకాష్, కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా శుక్రవారం ఆయన అవార్డు అందుకున్నారు.

గురువులకు పూర్వవిద్యార్థుల సన్మానం



పుత్తూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమేశ్వర మంగళం ఉన్నత పాఠ శాలలో శుక్రవారం గురుపూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 2005 బ్యాచ్ విద్యార్థులు గురువులను సన్మానించారు. ఎంఈవో తిరుమలరాజు, ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అదుపు తప్పి బోర్ వెల్స్ లారీ బోల్తా

కూలీలకు స్వల్ప గాయాలు



పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి):బోర్ వెల్స్ లారీ బోల్తా పడింది. ఈ సంఘటన శుక్రవారం పుత్తూరు సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... తిరుపతి నుంచి పుత్తూరుకు వస్తున్న బోర్ వెల్స్ లారీ గొల్లపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాల అడిగి తెలుసుకున్నారు.

జీవో 1214 రద్దు చేయండి



కరపత్రాల ఆవిష్కరణలో సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 5(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేసి, 1214 జీవోను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మునిరాజ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద చలో విజయవాడ వాల్‌పోస్టర్లును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఈ నెల 15వ తేదీన విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని భవన నిర్మాణ కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రశేఖర్, గోవిందరాజు, వెంకటేష్, జయ చంద్ర, ఆనంద్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం



బాధ్యతలు స్వీకరిస్తున్న కేవీ నాయుడు

పెళ్లకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అభ్యున్నతి కోసం కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని, అందులో భాగంగానే కొచ్చెర్ల వెంకటరమణయ్య నాయుడుకు చిల్లకూరు పీఏసీస్ చైర్మన్ పదవి వరించదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం పెళ్లకూరులోని పీఏసీస్ కార్యాలయంలో త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. రావులపాడు గ్రామానికి చెందిన కొచ్చెర్ల వెంకరమణయ్య నాయుడు (కేవీ నాయుడు) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా చిల్లకూరు పీఏసీఎస్ పరిధిలోని రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యంకు కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ సీఈవో రవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీకి, ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు తేవొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న పోలయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు

పెళ్లకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని కొందరు టీడీపీ సీనియర్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు పార్టీ పటిష్టతకు, ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు తెచ్చేలా ఉందని, ఇది సరైన విధానం కాదని ఏఎంసీ వైస్ చైర్మన్ పునబాక పోలయ్య, దామతోటి సుబ్రహ్మణ్యం హితవు పలికారు. శుక్రవారం కొత్తూరు టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. నిరంతరం ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, వారికి సహకరిస్తున్న అధికారులపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. మండలంలో అభివృద్ధి పనులు జోరుగు జరుగుతున్నాయని, కొంతమంది నాయకులు స్వలాభమే ధ్యేయంగా అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు ఆరోపించారు. నెలవల సుబ్రహ్మణ్యంతో పాటు ఎమ్మెల్యే విజయశ్రీపై కొంతమంది నాయకులు నిందలు మోపడం అభివృద్ధిని అడ్డుకోవడమే అన్నారు. మాజీ ఎంపీటీసీ వేలూరు రమణయ్య, మారాబత్తిన గురవయ్య, గుంటపూడి రమణయ్య. రాపూరు పరుశురామ్, రవి, చంద్ర, కన్నలి విజయభాస్కర్ పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ శీనయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిల్లకూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ముత్యాలపాడు గ్రామానికి చెందిన సోమశేఖర్, వెంకటేష్ బైక్‌పై గూడూరు నుంచి గ్రామానికి వెళుతుండగా వరగలి క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా వెను తిరగడంతో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న సోమశేఖర్, వెంకటేష్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఈవోగా సునీల బాధ్యతల స్వీకరణ



ఎంఈవోను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎంఈవోగా కేఎంఎస్ సునీల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవో-1గా ఉన్న శ్రీనివాసులురెడ్డి ఆరోగ్య సమస్యల కారణంగా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో మన్నారుపోలూరు హైస్కూల్‌లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా ఉన్న విధులు నిర్వహిస్తున్న సునీలను ఎంఈవో(ఎఫ్ఏసీ)గా నియమించారు. ఆమెను ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.





గోతులమయంగా ఉన్న కొరిడి - పేర్నాడు రోడ్డు - వర్షానికి బురదమయంగా మారిన వేనాడు రోడ్డు

పులికాట్ పల్లెలకు తారురోడ్లు కలేనా?

అటవీశాఖ అభ్యంతరాలతో అభివృద్ధికి అవరోధాలు ● కూటమి సర్కార్‌పై తీరప్రాంతవాసుల ఆశలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశానికే తలమానికమైన రాకెట్ ప్రయోగ కేంద్రం షార్‌ను ఆనుకునే ఉన్న పులికాట్ పల్లెలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. మూడు దశాబ్దాలుగా కొరిడి - పేర్నాడు తారు రోడ్డు నిర్మాణం కలగానే మిగిలిపోయింది. సూళ్లూరుపేట మండలంలోని కొరిడి - పేర్నాడు రోడ్డు, తడ మండలంలోని వేనాడు రోడ్డు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. కొరిడి - పేర్నాడు మార్గంలో కొరిడి, కడపత్ర, దామరాయి పంచాయతీల పరిధిలో దాదాపు 23 తీరప్రాంత గ్రామాలు ఉన్నాయి. అదే విధంగా తడ మండలం వేనాడు పంచాయతీ పరిధిలో 5 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలు షార్ సమీపంలో పులికాట్ సరస్సు మధ్యలో ఉన్నాయి. ఈ గ్రామాలకు వెళ్లే దారులన్నీ అటవీ ప్రాంతంలో ఉండడంతో తారురోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతం చెబుతుండడంతో తారురోడ్ల నిర్మాణానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఈ రోడ్డు గురించి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీ ప్రస్తావించిన నేటికీ కార్యరూపం దాల్చలేదు. కనీసం ఉన్న గ్రావెల్ రోడ్డునైనా మరమ్మతులు చేయండి మహాప్రభో అని గ్రామస్తులు వేడుకొంటున్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అట్టకానితిప్ప బీటీ రోడ్డు నుంచి కొరిడి - పేర్నాడుకు పులికాట్ సరస్సు మధ్యలో గ్రావెల్ రోడ్డును 1990లో కల్పించారు. అప్పట్లోనే బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రయత్నించినా అటవీశాఖ అభ్యంతరాలతో ఫలించలేదు. అనంతరం ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు చేసిన ప్రయత్నాలు నెరవేరలేదు. అదే విధంగా అట్టకానితిప్ప నుంచి కుడివైపు తడ మండలం వేనాడుకు పులికాట్ సరస్సును చీల్చుతూ గ్రావెల్ రోడ్డు ఉంది. వేనాడులో ప్రఖ్యాతి గాంచిన దర్గా ఉండడంతో పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తూ ఉంటారు. తారురోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 2009-2014, 2014-2019 మధ్య కాలంలో ప్రభుత్వాలు తారురోడ్డు నిర్మాణం కోసం ఐదుశాఖల అధికారులతో సర్వే చేయించి నిధులు మంజూరు చేసినప్పటికీ అటవీశాఖ అభ్యంతరాలతో పనులు ప్రారంభం కాలేదు. కొరిడి - పేర్నాడు మార్గంలో పలుసార్లు పులికాట్ సరస్సులో ఆర్టీసీ బస్సు బోల్తాపడిన సంఘనలు ఉన్నాయి. అదే విధంగా వేనాడు మార్గంలో పులికాట్ సరస్సులోకి బస్సు ఒరిగిపోయిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలం, వరదలు సంభవించినప్పుడు పులికాట్ సరస్సు నీరు రోడ్లపై ప్రవహించి కోతకు గురవుతున్నాయి. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ రహదారుల మరమ్మతులకు తట్టెడు మట్టి వేయకపోవడంతో అడుగడుగునా గోతులమయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారింది. కూటమి సర్కాల్ ప్రత్యేక చొరవ తీసుకుని తారు రోడ్డు సౌకర్యం కల్పిస్తారని ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.







గూడూరులో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ - తడ ఎంఈవో మల్లికార్జునరావును సత్కరిస్తున్న తిరుపతి, నగరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్ - కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న వెంకటగిరి పట్టణంలోని మనులాలపేట పాఠశాల ఉపాధ్యాయురాలు జగదీశ్వరి

గురువుల రుణం తీర్చుకోలేనిది

గూడూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పించి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే గురువుల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో, స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో డీవైఈవో మోహన్‌రావు, ఎంఈవో కాంచన, పవన్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, బాల కృష్ణంరాజు, దశరధ రామిరెడ్డి, రూపవతి, సురేష్‌బాబు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరు ప్రధాన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్న పెంటపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చెంతాటి వరలక్ష్మిని సన్మానించారు.కార్యక్రమంలో ఎంఈవో రవూఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడ: ఎంఈవో మల్లికార్జునరావు, ఎస్‌జీటీ శారద జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు. శుక్రవారం తిరుపతిలో జరిగిన గురుపూజోత్సవంలో తిరుపతి, నగరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివా సులు, గాలి భానుప్రకాష్, కలెక్టర్ వెంకటేశ్వర్ చేతులమీదుగా ఎంఈవో మల్లికార్జునరావు, ఎస్‌జీటీ శారద పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎస్‌జీటీలు రాంబాబు, నాగవేణి, సుహాస్‌కుమార్, శేషసాయికుమార్‌ను తడ ఎంఈవో కార్యాల యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేంద్ర, సుధాకర్, చెంచురామయ్య, ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురుపూజ దినోత్సవం నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 13 మందిని తహసీల్దార్ శ్రీనివాసులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, ఎఈవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎ.సుజాత(చెందోడు), ఎ.వినత(జరుగుమల్లి), సీహెచ్ దైవకృప(కొత్తపాళెం), పి.గీత(గూడలి)లను టీడీపీ నాయకులు, అధికారులు శాలువాలతో సన్మానించారు. ఆటలు, పాటల పోటీల్లో గెలు పొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎంఈవో మస్తానయ్య, ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కోటలో ఉత్తమ ఉపాధ్యాయులతో టీడీపీ నాయకులు, అధికారులు

బాలాయపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు నాగేశ్వ రావు, ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిం చారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపి కైన ఉషారాణి (అక్కసముద్రం), సిద్దేశ్వరి (వెంగమాంబపురం), కల్యాణి (అలిమిలి), కరుణకుమారి(మన్నూరు), స్వర్ణలత (వెంకటరెడ్డిపల్లి), ఆయేషా (మల్లెమాల), భారతి(పెండేరెడ్డిపల్లి), ఈతముక్కల వెంకట రమణయ్య (వాక్యం), వీరభద్రయ్య(భైరవరం) రామ్మోహన్ (పి.కొత్త పాళెం)లను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కందలి సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సరస్వతి శ్రీనివా సులు, పీవీ.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని మనులాలపేట పాఠశాల ఉపాధ్యాయురాలు జగదీశ్వరి, ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ రమాదేవి కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారు.





ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు - ఉత్తమ ఉపాధ్యాయులతో బాలాయపల్లి ఎంఈవోలు

రైతు సమస్యలపై దృష్టి



మీడియాతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రమేష్, పక్కన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు నాయుడు తదితరులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు అదనపు గోదాముల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దొరవారిసత్రం మండల టీడీపీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, స్థానిక నాయకులు మేడా సాయి నారాయణ, కొండలరావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే వ్యవసాయ సీజన్‌ను దృష్టి పెట్టుకుని ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చూడాలని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు విత్తనాలు, ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై ఈనెల 9న సూళ్లూరుపేటలో వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేసి ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తామన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సౌందర్యమ్మ, మాధురి, స్నేహలత, లక్ష్మి, శశిరేఖ, జీవని, సుప్రియ, రమాదేవి, విష్ణువందన, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయండి



చంద్రారెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న ఎంపీ గురుమూర్తి

తడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాశీంగాడుకుప్పం వద్ద ప్రస్తుతం ఉన్న రైల్వేగేట్ స్థానంలో అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని తిరుపతి ఎంపీ గురుమూర్తిని వైసీపీ నాయకుడు చంద్రారెడ్డి కోరారు. శుక్రవారం తిరుపతి ఎంపీ కార్యాల యంలో ఆయనను కలిశారు. అండర్ బ్రిడ్జి అవసరాన్ని వివరించారు. సుమారు 300 కుటుం బాలు ఉండే కాశీంగాడుకుప్పం, బాలకృష్ణాపురం కుప్పం గ్రామాలకు అనువుగా అండర్ బ్రిడ్జి నిర్మించకుండా పూడికుప్పం వద్ద నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల కాశీంగాడుకుప్పం, బాల కృష్ణాపురం కుప్పం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. స్పందించిన ఎంపీ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసు కువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డిని ఎంపీ గురుమూర్తి శాలువాతో సత్కరించారు.

కార్మికుల అభ్యున్నతికి కృషి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తానని భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్య క్షుడు నాలి మధుసూదన్ యాదవ్ అన్నారు. శుక్రవారం గుంటూరులోని సంఘ్ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి శామ్యూల్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. మధుసూదన్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు.

బాలికల వసతిగృహానికి రోడ్డు నిర్మాణం

నాయుడుపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి రోటరీక్లబ్ అధ్యక్షుడు ఆదవరపు నాగూరయ్య తన సొంత నిధులతో రోడ్డు నిర్మించారు. శుక్రవారం రోటరీక్లబ్ గవర్నర్ రవీంద్ర రోడ్డును పారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శులు చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, నాయకులు జయరాజగోపాల్, రామమోహన్, కృష్ణారావు, సోమశేఖర్, రామచంద్రారెడ్డి, హరిబాబు, శ్రీనివాసులు, సుజిత్, ప్రసాద్, శంకర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

తడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ అన్నారు. శుక్రవారం తడలో ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం మొదటి నుంచి టీడీపీలో ఉందని, దానిని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనను చైర్మన్‌గా నియమించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారుల సమస్యలు తనకు తెలుసన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ మత్స్యకారులకు పలు హామీలు ఇచ్చారని, వాటి అమలుకు కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకార భరోసా రూ.20వేలు అందించిందని, ఇదే తమ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉందని చెప్పడానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చొన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు పళణి ఉన్నారు.

షార్‌లో ఉపాధ్యాయ దినోత్సవం



సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ముత్తు చెరియన్ తదితరులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన షార్ సోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ముత్తు చెరియన్ మాట్లాడుతూ గురువు లేనిదే ఏమి లేదని, ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే గురువులు నేర్పిన విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. అంతకుముందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ జి.రమేష్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఎన్నిక ఏకగ్రీవం

వాకాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఆర్టీసీ డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. గౌరవ అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున, సహాయ కార్యదర్శి ఎస్ఆర్ చంద్రయ్యల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్షుడిగా జి.సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా షేక్ వజీర్‌బాషా, సహాయ కార్యదర్శులుగా డి.బలరామయ్య, ఏవీ.సుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా డి. రవి, ఆర్.శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. తొట్టంబేడు ఎంఈవో-2 భాస్కర్‌ను ఆయన శిష్యబృందం సత్కరించింది. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, రాష్ట్రోపాధ్యాయ సంఘం తిరుపతి జిల్లా అదనపు కార్యదర్శి దేవేంద్ర, ఎస్టీయూ సంయుక్త అధ్యక్షుడు లక్ష్మయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి రొద్ద గోపి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సుజుకి షోరూం యాజమాన్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, గుడ్ల శ్రీనివాసులు, యానాది సుబ్రహ్మణ్యంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.రవి, శివ, ధనంజయులు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారిపాకం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో సత్కరించారు, ఉపాధ్యాయులు దుష్యంత్‌రెడ్డి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, ఏడుకొండలయ్య, మునెమ్మ, మీరయ్య, పి.శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎంకు ఘనసన్మానం



ఏర్పేడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1977లో హెచ్‌ఎంగా పనిచేసిన 95 సంవత్సరాల ఎంఏ రంగనాథాన్ని ఆ సంవత్సరం ఆ పాఠశాలలో టెన్త్ చదివిన విద్యార్థులు శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా పాద పూజ చేసి సత్కరించారు. నారాయణ రెడ్డి, చెంగయ్య, గోవిందస్వామి, వెంకటరమణ, మునికృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.చంద్రశేఖర్ రెడ్డి, శంకర్, బత్తిరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఎంఈవోగా రవీంద్రనాథ్



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఎంఈవోగా బీఎన్‌కండ్రిగ మండలానికి చెందిన రవీంద్రనాథ్ తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, ఎంఈవో మునిసుబ్రమణ్యం ఆయన్ను అభినందించారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



కేవీపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పీఈటీగా పనిచేస్తున్న సతీసావిత్రి ఉత్తమ పీఈటీగా ఎంపికైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, పుత్తూరు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. కేజీబీవీ ఎస్‌వో సుకన్య, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాప్రదాతకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపనపల్లిలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గుమ్మడి మురళికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం వరించింది. శుక్రవారం తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో గురుపూజోత్సవంలో ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

చినబాబుకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు



సత్యవేడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరుగుళం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.చినబాబుకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు వరించింది. శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. చినబాబును పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. వరదయ్యపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్ ఎం.సుబ్బరామయ్య ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన్ను పలువురు అభినందించారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా వెంకటరమణ



నాగలాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం టీపీ కోట మోడల్ ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయులు వీరమంగళ వెంకటరమణ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును శుక్రవారం అందుకున్నారు. గత 25 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ ప్రతిభను కనబరచినందుకు ఈ అవార్డు అందినట్లు తెలిపారు. నాగలాపురం మండలంలోని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సమాజ నిర్మాణంలో గురువులదే కీలక పాత్ర



మార్కండేయులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో గురువులదే కీలక పాత్ర అని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో యోగా శిక్షణ ఇస్తున్న గురువు మార్కండేయులును సత్కరించారు. ఇక స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తన బోధనలు, ప్రసంగాల ద్వారా లక్షలాది మంది భారతీయులను విద్యాధికులను చేశారన్నారు. విద్యావంతులైన పౌరులను తయారు చేసి సమాజ అభివృద్ధికి ఉపాధ్యాయులు దోహద పడుతున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, మాజీ కౌన్సిలర్ నివేదిత మోరె, కోట చంద్రశేఖర్, గాజుల భగత్, కృష్ణమూర్తి, ఎస్.వంశీకృష్ణ, భాస్కర్‌నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఈశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరమణ, ఢిల్లీబాబు, భాస్కర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న శిల్పారెడ్డి

ఏర్పేడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి శిల్పారెడ్డి సూచించారు. చిత్తూరు జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, ఎండీపుత్తూరు పశువైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఎండీపుత్తూరు, చెల్లూరు గ్రామాల్లో పశువుల్లో వివిధ రకాల వ్యాధులు, టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిల్పారెడ్డి మాట్లాడుతూ.. వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన వేయించాల్సిన టీకాలను వివరించారు. బాహ్య పరాన్న జీవుల నివారణకు పిడుదుల మందు పిచికారీ మంచిదన్నారు. ఆత్మ ఏటీఎం భార్గవి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పవన్‌కుమార్, చంద్రశేఖర్, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయరాం క్షమాపణ చెప్పాలి

సత్యవేడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోలార్ కంపెనీ భూసేకరణలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డిని గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం దుర్భాషలాడడం దారుణమని సంఘం జిల్లా కార్యదర్శి జనార్దన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కలేనా?



కళత్తూరులో రోడ్డుపై ఉన్న ధాన్యం

కేవీబీపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్‌లో రైతులు పండించిన వరి ధాన్యానికి కొనుగోలు కేంద్రాలు లేక కళ్లాల్లో, రోడ్లపై కుప్పకుప్పలుగా చేస్తున్నారు. గతంలో మండలంలోని అంజూరు వద్ద ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ అయితే ఈ కేంద్రం వలన రైతులకు ఒరిగిందేమి లేదు.ఎగువపుత్తూరు నుంచి అంజూరుకు కనీసం 30 కిలోమీటర్ల దూరం ఉంది. అంతదూరం ధాన్యం తీసుకెళ్లి విక్రయించే పరిస్థితి రైతులకు లేదు. మండల కేంద్రంలో కానీ, పరిసర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు ఆసరాగా ఉంటుంది. దీంతో పాటు రైతులు పండించిన సజ్జకు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్నారు. కనీసం విత్తనాలు కొనుగోలు సుమారు రూ.2 వేలు ఉండగా ప్రస్తుతం పండించిన ధాన్యం రూ.1,200కు దళారులు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ యేడాది కనీసం రూ.500 నుంచి రూ.600 వరకు తక్కువ. గత ఏడాది ఇదే సీజన్‌లో సుమారు రూ.1,800 వరకు ధర పలికిన 75 కిలోల ధాన్యం ప్రస్తుతం రూ.1,200కే రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. దీంతో పండించిన రైతుకు నష్టం వాటిల్లోంది. గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆగమోక్తంగా పవిత్రోత్సవాలు







పూజా ద్రవ్యాలను తీసుకెళ్తున్న అధికారులు, అర్చకులు - భరద్వాజ మహర్షి, శ్రీ-కాళ-హస్తి ప్రత్యేక అలంకారం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలు మూడో రోజు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య పూజల్లో జరిగే దోషాలను నివారించి మూల విరాట్లకు పునరుత్తేజం తెచ్చే విధంగా ఈ పూజలను ఐదురోజుల పాటు నిర్వహించనున్నారు. మూడో రోజు ఉత్సవాల్లో ఆలయంలోని యాగశాలలో ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి విశేష అభిషేక పూజలు చేపట్టారు. పూర్ణాహారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

వైభవంగా ప్రదోష పూజలు



నాగలాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని పరివార దేవతామూర్తులకు అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పాలు,పెరుగు, తేనె, చందనం, పన్నీరులతో అభిషేకాలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడుని దివ్యాంగ సుందరంగా అలంకరించి కుంభ, నక్షత్ర, మహా హారతులు సమర్పించారు. పూజానంతరం మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి ఉత్సవమూర్తుకు ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

సోమనాథేశ్వర ఆలయంలో....

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధిరాజుకండ్రిగలోని సోమనాథేశ్వర ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోష నందికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సోమనాథేశ్వరుడి గర్భాలయం ముందున్న నందికి ఆలయ అర్చకుడు పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులపై మంత్రజలం చల్లాడు. ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు ఏర్పాట్లను పర్యవేక్షించగా బెంగళూరుకు చెందిన వాసు ఉభయోత్సవం నిర్వహించారు.

ఆస్పత్రి నుంచి డిశ్చార్జైన గుత్తివారిపల్లివాసులు



హరిజనవాడలో ఉన్న బావిలో నీటిని పరిశీలిస్తున్న జిల్లా వైద్య అధికారి బాలకృష్ణ నాయక్

రేణిగుంట సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): అతిసారంతో బాలాజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 16 మంది గుత్తివారిపల్లి వాసులు శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. మరో 9 మంది చికిత్స పొందుతున్నారు. మరో 3 తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం గుత్తివారిపల్లికి సమీపంలో ఉన్న హరిజనవాడలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కాచిన నీటిని తాగాలని సూచించారు. మూడు వారాల వరకు గ్రామంలో ఎటువంటి ఫంక్షన్లు నిర్వహించరాదని సూచించారు. అనంతరం విలేజ్ క్లినిక్‌లో చికిత్స పొందుతున్న హరిజనవాడకు చెందిన మహేశ్వరి ఆరోగ్య పరిస్థితిని అక్కడున్న వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చక్రపాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభ ఆధ్వర్యంలో గుత్తివారిపల్లిలో ఆర్వో నీటిని సరఫరా చేస్తున్నారు.

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

నాగలాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మండలంలోని బయటకొడియంబేడులో పలు సంక్షేమ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మొదటిగా గ్రామంలో 24 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం గుహన్ అనే బాధితుడికి రూ.1.25 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. తదుపరి ప్రత్యేక అవసరాల వ్యక్తులకు ట్రై సైకిళ్లను అందించారు. తనపై నమ్మకం ఉంచి రెండు సార్లు ఎమ్మెల్యే ఎన్నుకున్న ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. టీడీపీ నాయకులు మురళి, గుణశేఖర్‌రెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి, యమునమ్మ, తహసీల్దార్ హనుమాన్ నాయక్, వీఆర్‌వో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని సిటిజన్ వెల్ఫేర్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సంస్థ కార్యాయలంలో సర్టిఫికెట్లు అందజేశారు. ఎంజీ బాలాజీ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు





ఆలయం వద్ద ఎమ్మెల్యే గౌతు శిరీష, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్ను అనుపమ చక్రవర్తి



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గున్ను అనుపమ చక్రవర్తి, యూనియన్ బ్యాంకు మాజీ ఎండీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కుమారి మణిమేకలై కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల ప్రసాదాలు అందజేశారు.

బీఎన్‌కండ్రిగ ఏఎంసీ చైర్మన్‌గా జ్యోతి



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌కండ్రిగ మండల అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.సుధాకర్‌నాయుడి భార్య జ్యోతిని గురువారం ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి సుధాకర్‌నాయుడు అంకితభావంతో పని చేస్తున్నారు. 2009లో మొదటి సారి ఆయన పార్టీ మండల అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. పలుమార్లు అధ్యక్షుడిగానే పనిచేశారు. 2014, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా నిలబడిన అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ప్రస్తుతం ఆయన మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సుధాకర్ నాయుడు సేవలను గుర్తించి ఆయన భార్యను బీఎన్‌కండ్రిగ ఏఎంసీ చైర్మన్‌గా సీఎం చంద్రబాబు ప్రకటించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే బాలకృష్ణకు సుధాకర్‌నాయుడు దంపతులు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



కుమారస్వామి తిప్ప వద్దప్రారంభమైన వినాయక నిమజ్జనం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజ్ఞానగిరి వద్ద కొలువై ఉన్న విజయగణపతి ఆలయం ముందు ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ నిమజ్జనం శుక్రవారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ముక్కంటి ఆలయ నాలుగు మాడవీధుల మీదుగా ఊరేగింపు సాగింది. మండప నిర్వాహకుడు, తెలుగుయువత పట్టణ ఉపాధ్యక్షుడు వి.సిద్ధులయ్య, జి.హరి, చెంచయ్యనాయుడు, నాగమల్లి దుర్గాప్రసాద్, కాసరం రమేష్ పాల్గొనగా డీఎస్పీ నరసింహమూర్తి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపేటలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం జరిగింది. రూ.56 వేలకు సర్పంచ్ నిర్మల దక్కించుకున్నారు.

హయగ్రీవుడికి ప్రత్యేక పూజలు



ఏర్పేడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమందలో కొలువై ఉన్న హయగ్రీవస్వామి ఆలయంలో స్వామివారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీహయగ్రీవస్వామికి అష్టోత్తర కలశాలతో, విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. విశేష పూజలు, అలంకరణ అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు ఘన స్వాగతం

రేణిగుంట సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆపరేష కుమార్ సింగ్ కు ఘనస్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి ఇండియన్ ఎయిర్ లైన్స్ విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

జీఎస్టీ నిర్ణయంపై హర్షం

కేవీబీపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీజేపీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు నిత్యావసర వస్తువులపై అదనపు భారం పడకుండా ప్రతి కుటుంబం బాగుపడాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు దసరా, దీపావళి కానుకగా జీఎస్టీ తగ్గింపు ఇచ్చారన్నారు. ముఖ్యంగా ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయడం పాలసీదారులకు ఊరట కలిస్తుందన్నారు.